
‘లక్షాధికారైన లవణమన్నమె గాని మెరుగు బంగారమ్ము మ్రింగబోడు,’ అన్నాడు ప్రాచీన కవి శేషప్ప. ‘జానెడు పొట్టకు జగమంత ఆకలెందుకు,’ అని అడిగాడు ఆధునిక కవి శివశంకర్. అంతులేని ఐశ్వర్యం మనిషి లోలోపలి వెలితిని పూరించగలదా? బ్రహ్మాండమైన పిరమిడ్ నిర్మాణంలాగ సంపదలు పేర్చుకుంటూ పోయే మనిషి దాని అట్టడుగున నిర్జీవ పేటికని గుర్తించగలదా? ఏది వెలితి? ఏది పూరణ?

పాపినేని శివశంకర్

4

# పిరమిడ్





## తొలి దృశ్యం

*స్థలం: ఒక కొండ.*

*పాత్రలు: కొండనెక్కుతున్న ఇద్దరు స్నేహితులు.*

*విషయం: విభిన్న ఆసక్తులు.*

మనిషి కొండనెక్కటం ఒక సంకేతమైతే అది తన జీవితంలో ఉన్నత స్థానానికి చేరే ప్రయత్నం అనుకోవచ్చు. అదేమోగాని చిన్నప్పటి నుంచి కొండలెక్కటం సరదా నాకు, స్నేహితులతో కలిసి.

చదువుకునే రోజుల్లో ఒకసారి చిన్ననాటి స్నేహితుడితో ఆ కొండనెక్కాను. ఎక్కటానికి ఒక వీలు, వాలు అంటూ లేదు. రాళ్ల రప్పల మీదగా, తుప్పల పక్కగా, ఏటవాలు రాతిపలకల మీదగా, పట్టు చిక్కించుకుంటూ మెల్లగా పైకి చేరటమే.

కొండెక్కినాక నా మనస్సు విశాలం కావటం గమనించాను. నా ఆరాటాలన్నీ కొండ మొదట్లోనే వదిలేసినట్టు, జ్ఞాన బంధనాల నుంచి, కోర్కెల బంధనాల నుంచి విముక్తమైనట్టు, ప్రకృతిని మానవ ప్రకృతిని ఇంతకుముందు కంటే మరింతగా ప్రేమించగలిగినట్టు అనిపించింది. అయితే నా సహచరుడికి ఆ విధంగా తోచకపోవటమే వింత.

"నేనొక్కణ్ణే యీ కొండనెక్కి ఉంటే యింకా సంతోషించేవాణ్ణి," అన్నాడు ఏ మాత్రం మొహమాటం లేకుండా.

దిమ్మెరపోయాను. దాని భావం దబ్బున అంతుబట్టలా.

"ఏదైనా నేను మాత్రమే అధిరోహించాలని. ఎంతో ఎత్తుగా కనపడాలని, అందరికన్నా," చెప్పాడు ఆ ఐదున్నర అడుగుల ఎత్తున్న ఆ మిత్రుడు. "ఏటవాలుగా అందంగా ఉందీ కొండ," అన్నాడు కిందికి దిగుతూ. అతని మొహంలో నల్ల మబ్బేదో ముసరబోతుందని అర్థమైంది.

## మలి దృశ్యం

*స్థలం: బ్రహ్మాండమైన ఫ్లై ఓవర్.*

*పాత్రలు: దాని మీద ఇద్దరు స్నేహితులు.*

*విషయం: అతని ఆశయం.*

కాలక్రమంలో తన మాటల లోతెంతో అతనిప్పటికే నిరూపించాడు. బి.టెక్. పూర్తి కాగానే నేను కెమికల్ ఇంజనీర్‌గా ఒక కంపెనీకి

సెలెక్ట్ అయ్యాను. అతను కాలేదు. ఎం.టెక్. పూర్తి చెయ్యబోతూ మధ్యలోనే మానేశాడు. తనకు సరైన దారేదో ఎంచుకొన్నాడు. తండ్రి దివాలా తీసిన వ్యాపారస్థుడు. తండ్రి విఫలమైనచోటే విజయం సాధించాలని నిర్ణయించుకొని ఉంటాడు. పోగొట్టు కొన్న చోటే వెతుక్కోవాలంటారు. ఆ విధంగా తన సారాంశం రూపొందించుకొన్నాడు.

నా మాదిరిగా పుస్తకాలు విరివిగా చదివే అలవాటు పోయింది. చిన్న చిన్న కాంట్రాక్టు పనుల నుంచి, వంతెనలు భవనాల కట్టుబడి దాక ఎదగటం చూశాను. తాజా కాంట్రాక్టు పని - ముంబయిలో ఒక ఫ్లై ఓవర్ నిర్మాణంలో ఉండగా నా ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా అటు వెళ్లాను. కళేబరంలా ఉన్న ఆ నిర్మాణం పై భాగానికి నన్ను తీసుకెళ్లాడతను.

"దీని యెత్తు సెంటర్ పాయింట్‌లో పది మీటర్లు. ఇంత పెద్ద కన్‌స్ట్రక్షన్ ఈ ప్రాంతంలో లేనే లేదు. నిజానికి ఈ ఎత్తు నాకు చాలదు. అప్పుడు మనమెక్కామే, ఆ కొండంత ఎత్తుకు ఎదగాలి ఎప్పటికైనా," అన్నాడు ఐదున్నర అడగుల మిత్రుడు.

ఎదుగుదలని అతను స్కేళ్లతో, చెక్కుల్తో, లాభాల్తో కొలుస్తున్నాడని, తానెక్కిన కొండలాంటి 'ద్రవ్యరాశి'నేదో పేర్చుకుంటూ ఒక పిరమిడ్ నిర్మాణం చెయ్యటం అతని అసలు లక్ష్యమనీ నాకర్థమైంది. ఆ భావం అతని నోటి వెంటే మరో రకంగా విన్నాను.

"నిట్టనిలువు బహుళ అంతస్తుల భవనాలకంటె ఇలాంటి ఏటవాలు నిర్మాణాలే నా కిష్టం."

అతని మొహంలో ఒక నల్లమబ్బు తారట్లాడుతూ -

అలా అలా వంతెన కింద చాలా నీరు ప్రవహించింది.

## మూడో దృశ్యం

*స్థలం: చిన్న యిల్లు.*

*పాత్రలు: ఇద్దరు మనుషులు, మధ్య ఒక పెట్టె.*

*విషయం: ఋజువు.*

ఒక మనిషికి మరో మనిషి మీద నమ్మకం ఏర్పడటానికి ఏదైనా ఒక ఋజువు కావాలి. అట్లా ఒకానొక సందర్భంలో అతను నన్ను ఋజువు చేసుకొన్నాడు. వారణాసి వెళ్తూ వెళ్తూ అతను రెండడుగుల పొడుగు, అంతే వెడల్పు, అడుగున్నర ఎత్తున్న ఒక పెట్టెను మా యింటికి తెచ్చాడు. డ్రైవర్ లేకుండా కార్లో ఒంటరిగా వచ్చాడు. కారు డిక్కీలో నుంచి అంత పెద్ద పెట్టెను కష్టంగా మోసుకొస్తుంటే అతను జీవితంలో పడిన పెద్ద శ్రమ అదేనేమో అన్పించింది. పెట్టె పై మూత ఏటవాలుగా పిరమిడ్ ఆకారంలో చెక్కబడి ఉంది.

"నేను తిరిగి వచ్చేదాక ఇది నీ దగ్గరే భద్రంగా ఉంచాలి," అని చెప్పాడు. "ఇది నా ప్రాణంతో సమానం," అన్నాడు మళ్లీ.

అందులో ఏముందో చెప్పలేదు. తెలుసుకోవాలనే ఆసక్తి లేదు నాకు. బాల్య స్నేహితుడికి చిన్న సాయం, అంతే. నాలుగు నెలల తర్వాత తిరిగి వచ్చినప్పుడు ఆ పెట్టె భద్రంగా అప్పజెప్పాను. ఆత్రంగా అందుకొన్నాడు.

'ఇందులో ఏముందో ఇప్పటికీ తెలుసుకోవాలన్పించలేదా?'' అని అడిగాడు.

తల అడ్డంగా ఊపాను. ''ఏముందో అది నీకు సంబంధించింది. నా పని దాన్ని కాపాడి తిరిగి అప్పజెప్పటం వరకే.''

''ఇందులో ఇరవై కిలోల బంగారం, ఇంకా వజ్రాలు అవీ ఉన్నాయి. ఏదో దాడి జరగబోతుందని రూఢిగా తెలిసింది. నీకన్న భద్రమైన ప్రదేశం నాకు కన్పించలేదు. నౌ అయాం సేఫ్,'' చెప్పాడతను చిరునవ్వుతో.

ఆ నవ్వులో ఇంకో అంతరార్థం కూడా ఉందనిపించింది. నన్ను నమ్మటంలో సరైన నిర్ణయం తీసుకున్నాననేది ఆ సంతోషానికి కారణమై ఉండాలి.

''నువ్వు నమ్మదగిన ఫ్రెండువని ఋజువు చేసుకున్నావు.'' మళ్లీ అదే నవ్వు.

అతనికా విధంగా ఉపయోగపడినందువల్ల నన్ను నేను ఋజువు చేసుకొన్నందుకు కించపడ్డాను. నా మొహం జేవురించటం అతను గుర్తించలేదు. వెళ్లబోతూ అందమైన చిన్న పెట్టెలో రెండు వజ్రాలు పెట్టి ఇవ్వబోయాడు. తిరస్కరించాను. తన నమ్మకాన్ని నేను నిలబెట్టుకొని, అందుకు ప్రతిఫలం తీసుకోవటం అగౌరవం.

సరికొత్త నిర్మాణాల ద్వారా త్వరత్వరగా పైకి వెళ్తున్నట్టు, ఇంకా తొందరగా శిఖరం చేరాలనుకుంటున్నట్టు తన మాటల్లో తెలిసింది.

''ఏటవాలు నిర్మాణాల్లో పట్టు చిక్కక జారిపడే ప్రమాదం ఉంటుంది. కూడ దీసుకోవటం చాలా కష్టం,'' అని చెప్పాను.

పగలబడి నవ్వాడు. అది అతని లెక్కలేనితనానికి నిదర్శనం అనిపించింది.

అయితే అప్పటినుంచి అతను తన జీవనయానంలో నాకో 'ప్రత్యేక' స్థానం ఇస్తున్నాడని అర్థమైంది. అతను తన నిర్మాణాల్లో పైపైకి వెళ్లేకొద్దీ అభద్రంగా తలపోస్తూ ఉండొచ్చు. ప్రమాదరహితంగా సాగటానికి తన నమ్మకాన్ని ఋజువు చేసుకొన్న వ్యక్తులు చాలా అవసరమని తోచి ఉండొచ్చు.

పైపైకి వెళ్లేకొద్దీ పతనభయం పెరుగుతుందనేది సాధారణ సూత్రం.

## నాలుగో దృశ్యం

*స్థలం: మహాద్భుత విశాల భవనం.*

*పాత్రలు: ఒకానొక దేవకన్య, ఇద్దరు స్నేహితులు.*

*విషయం: ఐశ్వర్యం.*

అతని నూతన భవనంలో ఒక ఉత్సవానికి ఆహ్వానించినప్పుడు ఆశ్చర్యపోయాను. అప్పటికే మూడు ఇంద్ర భవనాలుండగా నాలుగో దాని అవసరమేమిటి? అదే అడిగాను.

నవ్వాడు. నా ప్రశ్నకి జవాబు దొరకలేదు. అయితే తక్కిన సంగతుల ద్వారా అర్థమైంది. ఏ వంద కార్లలోనో దిగిన అతిథుల్ని పలకరిస్తూ, పనివాళ్లను పురమాయిస్తూ అజమాయిషీ చేస్తున్న ఒకానొక చక్కని పడుచుదనం నా కళ్లబడింది. ఆమెను దేవకన్యగా పరిచయం చేశాడు. ఆ దేవేంద్రభవనం ఆ 'దేవకన్య' కోసమే అని, అది ఆమె

పుట్టినరోజని రూఢి అయ్యింది. అట్లా రూఢి కావటానికి ఆ ఫంక్షన్‌లో ఎక్కడా అతని భార్య కనపడకపోవటం ఒక కారణం. భార్యే కాదు, ఒక్కగానొక్క కొడుకు జాడ కూడా లేదు.

నిజానికి అతని భార్య అటువంటి పార్టీల్లో ప్రధానమహిళగా తరచు కనపడేది కాదు. అప్పుడప్పుడు నాతో సోదరిలాగా ఆప్యాయంగా మాట్లాడేది. ఆ గొంతులో అపార సంపదకి తను రాణిననే స్పృహకి బదులు ఆ సంపద బరువు తనని కుంగదీస్తున్న స్ఫురణే ఉండేది. ఒంటిమీద ఒకటో అరో తప్ప నగలుండవు. వీలైనంత వరకు ఒంటరిగానే ఉండటానికి ఇష్టపడేది. ఆ యింటికి నేను వెళ్లినప్పుడు చాలాసార్లు ఆమె పూజామందిరం నుంచే రావటం గమనించాను. బహుశః ఏదో ఉపశాంతిని అక్కడ కోరుకొనేది.

ఇటలీ నుంచి దిగిన పాలరాళ్లతో, బెల్జియం అద్దాలతో, వెనీషియన్ షాండి లియర్లతో, ఫ్రెంచి కళాకౌశలాన్ని తలపించే అత్యంత ఖరీదైన ప్రాసాదం చూసి అతిథు లంతా అతణ్ణి ప్రశంసల్లో ముంచెత్తారు. 'దేవకన్య' తన చెయ్యి సుతారంగా పట్టుకోగా అతను అతిథులందర్నీ గదిగదికీ తిప్పి చూపించాడు. మొత్తం ముప్ఫయ్యారు పడక గదులున్నాయి. తమ నగ్నతను కన్నారా తిలకిస్తూ చెయ్యగల స్నానమందిరాలున్నాయి. అతనివెప్పుడూ బ్రహ్మాండమైన నిర్మాణాలే.

''నీ అవయవాలన్నీ విడివిడిగా ఒక్కో గదిలో పడుకున్నా ఇంకా చాలా మిగిలి పోతాయి,'' అన్నానతనితో సరదాగా. నన్ను అమాయకుడిగా చూశాడు.

''ఒక్కోసారి విదేశాల నుంచి అతిథులు ఎక్కువగా వస్తారు గదా? అందుకని.''

చిత్రంగా ఆ ఉత్సవంలోనే అతనొక విలక్షణ ప్రకటన చేశాడు, ఫలానా గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నానని. ఆ ఫలానా దాని అభివృద్ధి కోసం తానేం చెయ్యబోతున్నాడో వివరిస్తుంటే ఆ పెద్ద హాలంతా చప్పట్లతో మారుమోగిపోయింది. అతను అందరికీ ఐదున్నర అడుగులకంటే ఎంతో ఎత్తుగా కనపడుతున్నాడని తోచింది.

ఆ ఊరి పేరు నేనింతకు ముందెప్పుడూ వినలేదు. అంత మంచిపని చేస్తున్నం దుకు అభినందించి, ఆ గ్రామం ఎక్కడుందని ఎవరో అడిగారు.

''నో ఐడియా. మా పి.ఏ. ఏదో చెప్పాడు, ఓకే అన్నాను,'' చెప్పాడతను తేలిగ్గా.

ఊరి వివరాలే తెలియకుండా, అక్కడి జనం మీద మమకారం లేకుండా ఎందుకతను దత్తత తీసుకున్నాడు? ఈ సమాజానికి తానేదో చేస్తున్నాననే అపభ్రమ కోసమా? ఏదో చేస్తున్నట్టు సమాజం నమ్మే ప్రచారం కోసమా? రకరకాల మధువులతో సాయంత్రపు విందు అయినాక అతిథులంతా అభినందనలతో సెలవు తీసుకొనే టప్పుడు నన్ను మాత్రం ప్రత్యేకంగా ఉండమన్నాడు.

'దేవకన్య' అప్పటికే బాగా అలిసిపోయినట్టుంది. వేడుక జరిగినంతసేపు ఆమె నవ్వుతూ తుళ్లుతూ అటు ఇటు తిరుగుతూనే ఉంది. అన్ని గంటలసేపు ఏ మాత్రం విరామం లేకుండా నవ్వగలగటం ఎంతో అభ్యాసంతో తప్ప రాదు. ఒకసారి అది

పెదాల చివర్లు సాగదీసిన నవ్వు. మరోసారి పలువరస కనపడే నవ్వు. ఇంకోసారి కిలకిల నవ్వు. వేరొకసారి విరగబాటు నవ్వు. ఏ సందర్భంలోను ఆమె తన అలంకరణ, శిరోజాల సవరింపు మర్చిపోలేదు. ఒక స్త్రీ అన్ని ఖరీదైన నగలు ఒంటిమీద మొయ్య గలదా అన్పించేటంతగా వజ్రహారాలు ఆమె రూపానికి మరింత వన్నె తెచ్చాయి. అతిథులంతా ఆమె కదలికల్లో నాట్యభంగిమలు చూసి ఆకర్షితులయ్యారనటంలో సందేహం లేదు. నాకు మాత్రం ఆమె ఒక గాజుబొమ్మ అని, గాజుతో చాలా జాగ్రత్త అవసరమని, చిన్న తాకిడికే చిట్లిపోతుందని- ఇట్లా ఏవేవో పిచ్చి ఊహలు వచ్చాయి. కాని గాజుబొమ్మలు తమంత తాముగా అదృశ్యమైపోగలవని ఆలస్యంగా తెలిసింది. ఆ సంగతి తర్వాత.

"ఇతరులెవ్వరికీ తెలీని అద్భుతం నీకు మాత్రమే చూపిస్తా, రా..." అంటూ అతను నా చెయ్యి పట్టుకొని లాక్కెళ్లాడు. అప్పటికి 'దేవకన్య' విశ్రమించటానికి వెళ్లింది. పనివాళ్లు హాలు సర్దటంలో మునిగిపొయ్యారు. ఆ మహాభవనంలో ఏయే గదుల్లోంచి, మలుపుల్లో నుంచి, మూల దారుల్లోనుంచి ఎక్కడికి తీసుకెళ్లాడో గమనించేలోపే ప్రపంచంలోని అత్యంత సుందరమైన ఒకానొక నేలమాళిగలో నేనున్నానని గ్రహించాను. అది పూర్తి చీకటీ కాదు, పూర్తి వెలుతురూ కాదు. కల కాదు, భ్రాంతి కాదు. అద్భుతం, అంతే.

అర్ధనగ్న, పూర్ణనగ్న సాలభంజికలతో సమ్మోహితమైన ఆ విశాల వృత్తాకారపు గదిలో చాటునున్న ఒక మీటనొక్కి ఏ మాత్రం ఆచూకీ తెలీని తలుపు తెరిచాడు. నా కళ్లు మిరుమిట్లు గొలిపాయి. అందులో పెద్ద పెద్ద అరలు. అరల్లో పసిడి వన్నె దిమ్మెలు. ఏటవాలుగా పైకి పేర్చి ఉన్నాయి. అన్నిటికన్న పైన ఒకే ఒక్క చిన్న దిమ్మె విలాసంగా, గర్వంగా కూర్చుని ఉంది. అది అతనికిష్టమైన పిరమిడ్ నిర్మాణం. వజ్రాలు అతనికి బాగా ఇష్టం కాబోలు, ఒక పెట్టె నిండా ఎన్నో కారెట్ల విలువ గలవి మెరుస్తు న్నాయి. కారెట్ మాజిక్ నెంబర్లు గలవి కూడా నాకు తెలీకపోయినా - చూపించాడు. ఇంకా రకరకాల రత్నాలు వేర్వేరు పెట్టెల్లో ఉన్నాయి. మరకతాలు ఎక్కువ. మరికొన్ని అరల్లో దొంతరలు దొంతరలుగా సరికొత్త నోట్ల కట్టలు. ఆ మార్మిక ప్రదేశం ఏదో వింత వాసనతో సొక్కిపోతుంది. బహుశ అది ఐశ్వర్యవాసనేమో.

"ఎవరికీ అనుమానం రాకుండా ఈ నేలమాళిగ నిర్మించటానికి ఏడాది పట్టింది. బ్రహ్మదేవుడు కూడా దీన్ని కనుక్కోలేడు." అతని గొంతులో వింత విలాసం తొణికిసలాడింది.

అయితే ఆ రహస్యప్రదేశాన్ని, అందులో తన గూఢసంపదని నాకెందుకు వెల్ల డించాడో అర్థంకాలేదు. అది కేవలం అతని నమ్మకాన్ని నేను ఋజువు చేసుకున్నందు వలన కాదు. తను అనంత రహస్య ఐశ్వర్యవంతుడిననే సంగతిని ప్రపంచంలో ఏ ఒక్కరితోనైనా పంచుకోకపోతే అతని ఆరాటం తృప్తిపడదేమో. మరేదో కారణం కూడా ఉందని తర్వాత బోధపడింది.

"పాలీహెడ్రాన్ నిర్మాణాలంటే ఇష్టపడే నువ్వు ఈ సిలిండ్రికల్ కట్టడంలోకి దిగావేంటి? ఆ ఎత్తు, ఈ లోతు పరస్పరం విరుద్ధమైనవి కదా? ఇది సరైంది కాదు," అన్నాను ఉండబట్టలేక. నేను ఆ నేలమాళిగను, దాని రహస్యాన్ని ఉద్దేశిస్తున్న సంగతి తెలియని వాడేమీ కాదతను. అయినా పట్టించుకోలేదు. నవ్వి ఊరుకున్నాడు.

"వెయ్యేళ్లు తిని కూర్చున్నా తరిగిపోని సంపద. ఇదంతా ఏం జేసుకుంటావు?" అమాయకంగానే అడిగానేమో.

దానికి జవాబియ్యకుండా, "అలాగే వెయ్యేళ్లు వర్ధిల్లమని కోరుకో," అన్నాడు పెద్దగా నవ్వుతూ. అంతలోనే అది రహస్యప్రదేశమనే స్పృహతో ఆపేశాడు.

"దీనికోసం రాత్రింబగళ్లు చెమటోడ్చా," అన్నాడు.

నవ్వొచ్చింది. నాతో తనకేమీ ప్రమాదం లేదనే ఋజువైన నమ్మకంతో కావచ్చు, ఆ 'చెమటోడ్చిన' వైనం టూకీగా చెప్పుకొచ్చాడు. ఏ ఉద్యోగం లేని దశ నుంచి భవన నిర్మాతగా, బడా కాంట్రాక్టర్‌గా, పిరమిడ్ హోటల్స్ గ్రూప్ అధినేతగా అంచెలంచెలుగా ఎదిగిన సంగతి నాకు తెలుసు. విదేశాల్లో అతనికి కంపెనీలు కాని కంపెనీలేవో ఉన్నట్టు తెలిసింది.

చివరగా కొడుకు తన మాట వినటం లేదని చెప్పి, తన పనుల్లో నన్ను తోడుగా ఉండమని, లాభాల్లో నాలుగో వంతు ఇస్తానని అడిగాడు.

పెద్దగా ఆలోచించకుండానే తల అడ్డంగా ఊపాను. 'నేలమాళిగల్లో ఊపిరాడదు నాకు,' అన్నాను నవ్వుతూ.

నాకు నచ్చకపోయినా అదంతా కచ్చితంగా అతని విలక్షణ మేధాశక్తే. ఆ శక్తితో అతను ఎవరినైనా, దేన్నైనా (కనీసం కొంతకాలం) ఏమార్చగలడన్పించింది. కాని తన మొహంలో అలముకొనే నీలిమబ్బును ఎప్పటికైనా పారదోలగలడా?

అంత అందమైన నేలమాళిగ నిర్మించగలిగిన అతను ఒక సంగతి ఎందుకు గుర్తించలేకపొయ్యాడో అర్థం కాలేదు. అదే అడిగాను.

"ఈ గదిలో చుట్టూ వ్యాపించిన ఆ నీలవలయం సంగతేమిటి?'

ఆశ్చర్యంతో అతని కనుబొమలు ముడివడ్డాయి. "నీలవలయమా? అదెక్కడ?" అంటూ చుట్టూ చూశాడు. "లేదు లేదు," అన్నాడు తొందరగా.

నాకంత స్పష్టంగా కనపడుతున్న ఆ కారునలుపు వలయం, మెలికలు తిరుగుతున్న వలయం అతనికెందుకు కనపడలేదు?

"ఏ మెలికలూ నువ్వు గమనించలేదా? కారు నలుపు, అమావాస్య నలుపు. దీన్నుంచి నువ్వు బయటపడితే సంతోషిస్తా."

"అమావాస్య అంటావేమిటి? ఇవాళ పౌర్ణమి," నా మాటను ఖండిస్తూ అతను.

"చీకటిలో నీకది కన్పించకపోయుండొచ్చు. పోనీ ఆ బుస అయినా వినపడుతుందా?"

విసుగ్గా తల విదిలించాడు. "దట్స్ ఎనఫ్. పద, బయటికెళ్దాం."

ఇంటికి వెళ్తుండగా నింగిలో నిండు చందమామ. కానీ అక్కడ మాత్రం అది నిశ్చయంగా అమావాస్యే.

## ఐదో దృశ్యం

*స్థలం: స్నేహితుడి యిల్లు.*

*పాత్రలు: అతని భార్య, నేను.*

*విషయం: వేదన.*

ఆమె నాకు అతని భార్యగానే మొదటి పరిచయం. కాలక్రమంలో నన్ను సోదర సమానంగా అభిమానిస్తుందని గ్రహించాను. ఒక చెల్లెలు తప్ప అన్నదమ్ములు లేరామెకి. ఎప్పటిలా ఆమె పూజామందిరంలో నుంచే హాల్లోకి వచ్చింది. విషాదమేదో గూడు కట్టుకొని ఉంది మొహంలో.

"వాడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు," చెప్పింది ఏ ఉపోద్ఘాతం లేకుండానే.

అది కొడుకు సంగతి. ఎందుకని అడిగాను.

"తండ్రీ కొడుకులకి చాన్నాళ్ల నుంచి సరిపడటం లేదు. తన వ్యాపారాలకి అండగా ఉండమని ఆయన ఒత్తిడి. ఆ పద్ధతులేవీ వాడికి నచ్చటం లేదు. నిన్న పెద్ద ఘర్షణే జరిగింది. మాట వినని కొడుకు నాకెందుకని ఆయన. దారితప్పిన తండ్రి తనకీ అవసరం లేదని వాడు. వెళ్లిపోయాడు. వాళ్లవి కోపాలు. నాది బాధ."

ఆ మాత్రం అభిప్రాయభేదానికే అంత దూరం ఎందుకెళ్లారని అడిగాను. ఆ లోతుపాతులు తనకు తెలియవని చెప్పింది. కొడుకు ఆరోపణల్లో హవాలా, మనీ లాండరింగ్, నలుపు తెలుపు మొదలైన మాటలు దొర్లినట్టు, అందువల్ల అదేదో తీవ్రమైన విషయం అనుకొన్నట్టు చెప్పింది. నేలమాళిగలు అందుకే అతనికి అవసరమైనట్టు గ్రహించాను. వెళ్తూ వెళ్తూ తనతో కొడుకు అన్న మాటలు ఆమెను కల్లోల పరిచాయి.

"అమ్మా! రోజు రోజుకీ నల్లగా మారుతున్న మనిషికి వారసుడుగా మిగిలి పోవటం నా సమస్య. దానికి ఇవాల్టితో పరిష్కారం దొరికింది. భర్త కాని భర్తతో కాపురం నీ సమస్య. దానికి పరిష్కారమేంటో ఆలోచించు."

భర్త కాని భర్త అంటే ఏమిటో ఆమెకు తెలుసు. కొడుకు ఆమెను తనతో తీసుకెళ్లటానికి సిద్ధంగా ఉన్నాడు. ఆమె తుపానులో చిక్కుకుంది. నా సాయం కోరుతుంది.

"పూజగదిలోనూ ఇప్పుడు నాకు శాంతి దొరకటం లేదు. ఈ సమయంలో అన్నయ్యలాంటి మీరు తప్ప నాకెవరున్నారు?" ఆమె కన్నుల్లో నీరు.

అతను తనను తాను తెలుసుకొనేటట్టు చెయ్యటమే నేను చెయ్యాల్సిన పని. రాత్రి బాగా పొద్దుపోయినాక వచ్చాడు. వేరే గదిలో కూర్చున్నాం. తన కుటుంబ విషయాల్లో నేను జోక్యం చేసుకుంటున్నందుకు ఏమీ అనలేదు. అయితే తనను సరికొత్తగా అర్థం చేసుకోవటానికి అతను సిద్ధంగా లేడు.

"వాడికీ నాకూ ఇంక కుదరదు," అని తేల్చి చెప్పాడు. దాన్ని గురించి ఇంక మాట్లాడటానికి ఏమీ లేదు.

"మరి ఆమె సంగతి?"

"దట్ బిచ్ డిసీవ్డ్ మీ," అన్నాడు. ఆ మొహంలో కోపం తెగ సుళ్లు తిరిగింది.

ఆశ్చర్యంలో నుంచి తేరుకొని అన్నాను, "దేవకన్యలు అలాగే ఎగిరిపోతారు మరి. అయితే నేనడిగింది 'ఆమె' గురించి కాదు. ఇక్కడున్న ఆమె గురించి."

'నేనేమీ లోటు చెయ్యటంలేదు. నాతో ఉండటమా లేదా అనేది ఆమె యిష్టం."

ఇప్పుడు అతని మొగమంతా కారు నల్లటి మబ్బు అల్లుకొంది. బయటి లోటు గురించి తప్ప లోపలి శూన్యం గురించి ఆ మారని మనిషి ఆలోచించటం లేదు. తన లోపల పేరుకుంటున్న దుఃఖాన్ని కూడా గుర్తించటం లేదు. స్వస్వరూపం తెలుసు కోకపోవటమే అసలైన దుఃఖం. ఎన్ని విధాల నచ్చజెప్పినా అతను వినలేదు. తొలినాటి కొద్దిపాటి మెత్తదనం అతనిలో ఏ కోశానా లేదు. అది దృఢత్వం అని అతని విశ్వాసం. కాఠిన్యం అని నా అవగాహన. అతని అపారసంపద అతనికి తిరుగులేని కాఠిన్యం ఇచ్చింది. నచ్చకపోయినా బాల్యస్నేహాన్ని వదులుకోలేని బలహీనత నాది. ఆమెలోని దుఃఖపు చారికల్ని తుడవలేకపోయినందుకు విచారించాను. ఏదో భూకంపం రాబోతుందని ఒకానొక అస్పష్ట స్ఫురణ.

## ఆరో దృశ్యం

*స్థలం: గాలి, వెలుతురు లేని గది.*

*పాత్రలు: ఊచల లోపల అతను, వెలుపల నేను.*

*విషయం: ఒక ఎరుక.*

"అంతా అయిపోయింది," అన్నాడతను నిట్టూర్చుతూ.

అతనిప్పుడు తన దేవేంద్రభవనంలో గాక ప్రపంచంలో తానెక్కడ ఉండగూడ దనుకుంటాడో అక్కడే ఉన్నాడు. ఒక్కసారి పరిసరాలు చూశాను. అది అతని నాలుగు భవనాలు, బంగళాల్లో ఏ ఒక్కదానికంటే వందరెట్లు తీసికట్టు. ఎంతో ఇరుగ్గా, గాలి, వెలుతురు సరిగ్గా సోకకుండా ఉంది. చుట్టూ రంగు వెలిసిన పెచ్చులూడిన గోడలతో పాడుబడ్డ దెయ్యాల కొంపలా.

అతని నేలమాళిగని బ్రహ్మదేవుడు కనుక్కోలేకపోయినా మానవమాత్రులే కనుక్కున్నారు. విదేశ వ్యాపారాలకు సంబంధించిన మానిప్యులేషన్. ఫెమా, పి.ఎం. ఎల్.ఎ. చట్టాల ఉల్లంఘన. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు. ఆస్తుల జప్తు. భూ కంపంలో అంతా కుప్పగూలిపోయింది. పరమపద సోపానపటంలో పాము వాత బడి ఏటవాలుగా జారి జారి, తిరిగి మొదటి గడికి. బాక్ టు స్క్వేర్ ఒన్.

'ఇక్కడ నీకు సౌకర్యంగా ఉందా?' అడిగాను.

"అంతా పోయింది. సోషల్ స్టేటస్ కూడా. ఇంక దేన్ని గురించి ఆలోచించాలి? పెద్ద విశ్రాంతి. అయినా ఎందుకో ఏదో తేలిగ్గా ఉందనిపిస్తుంది."

"నిజంగానేనా?"

విచిత్రంగా నవ్వాడు. నవ్వి నవ్వి పొలమారింది. ఆగినాక అతని కళ్లల్లో నీటితడి.

“ఇన్నేళ్లుగా ఊపిరి తిరగని పనులు. ఉద్వేగం. తెరిపిలేని ఆలోచనలు, తేనెటీగల ముసురులా. ఎప్పుడూ ఏమాత్రం ఖాళీ లేకపోవటాన్ని ఆస్వాదించాను. అందులోనూ ఎప్పుడూ ఏదో తెలీని టెన్షన్. ఇప్పుడొక కామా పడింది. లేదా ఫుల్‌స్టాప్. ఒక రకంగా తేలిగ్గా ఉంది.”

ఇన్నాళ్లూ అతను చేస్తూ వచ్చిన మహానిర్మాణం రాను రాను అతని మీదే పెను భారమైంది. ఇప్పుడది తొలగిపోయింది. అతని కళ్లలో మునుపటి దాహం, అంతులేని ఐశ్వర్యం కలిగించిన ధాటి, ఆధిపత్య గర్వం లేవు. ఐదున్నర అడుగుల కంటే చాలా కుంగిపోయాడతను. “ఆ నల్లని వలయం ఇప్పుడర్థమైంది,” అన్నాడు.

కాసేపు ఆగి మళ్లీ చెప్పాడు. “ఆమెను కొడుకు దగ్గరికి వెళ్లమన్నాను.”

“మంచి పని,” అన్నాను.

కాసేపాగి చెప్పాడు. “లోపలేదో తెలీని వెలితిగా ఉంది.”

“అది తెలుసుకోవటమే ముఖ్యం. ఇన్నాళ్లూ పూరించలేని వాటితో నిన్ను పూరించుకున్నావు. పిరమిడ్ అట్టడుగున ఏముంటుందో ఎప్పుడూ ఆలోచించలేక పొయ్యావు,” అన్నాను.

నిట్టూర్చాడు. అతనికా మాటలు అర్థమయ్యాయో లేదో తెలీదు. అతని పక్కగా చూస్తుంటే వెనక గోడమీద బొగ్గుతో ఎవరో రాసిన వాక్యం నన్నాకర్షించింది.

“నిన్ను నీవు కనుగొనుము.”

అతని మారుతున్న రూపాన్ని నేనెప్పుడో గుర్తించాను. కాని దాన్ని అడ్డుకోలేక పొయ్యాను. ఇప్పటికైనా తనను తాను సరిగ్గా కనుగొనగలడా?

“మీ సమయం అయిపోయింది,” లాఠీవ్యక్తి వచ్చి చెప్పాడు.

తిరిగి వెళ్తుండగా వెనక నుంచి అడిగాడు, “ఏం తోచటంలేదు. ఈసారి వచ్చేటప్పుడు ఏదన్నా ఒక పుస్తకం తెచ్చి పెడుదూ.”

తల ఊపాను. ఏ పుస్తకం తేవాలో కూడా వెంటనే తట్టింది.

'How much land does a man need.'

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*5 ఫిబ్రవరి 2017*

*



పాపినేని శివశంకర్ 6 నవంబర్ 1953న గుంటూరు జిల్లా నెక్కల్లులో జన్మించారు. వీరి మొదటి కథ *కలుపు మొక్క* 1977లో ప్రజాతంత్రలో అచ్చయ్యింది. *మట్టిగుండె*, *సగం తెరిచిన తలుపు* కథాసంపుటాలు, ఐదు కవితా సంపుటాలు, మూడు వ్యాససంపుటాలు, ఒక పరిశోధనా గ్రంథం ప్రచురించారు. రజనీగంధ కవితాసంపుటానికి 2016లో కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు లభించింది.

*చిరునామా: 4-5-29/60, 3వ లైను, విద్యానగర్, గుంటూరు-522007*
*ఫోన్ : 85008 84400* **papineni22@gmail.com**